## డ్రైనేజీ ఏర్పాటుకు భూమి పూజ

**బత్తలపల్లి, జూన్ 18 ప్రభాతవార్త**


డ్రైనేజీ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఆర్డబ్ల్యూఎస్ ఏఈఈ

మండల కేంద్రమైన బత్తలపల్లిలోని టీచర్స్ కాలనీలో డ్రైనేజీ ఏర్పాటుకు టిడిపి నేతలతో కలిసి బుధవారం ఆర్డబ్ల్యూఎస్ ఏఈ జ్యోతి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె వ రా ట్లా డు తూ గ్రామాలలో, వీధులలో, ఇంటి పరిసరాలలో అపరిశుభ్రత లేనప్పుడే ప్రజలు ఆరోగ్యంగా ఉండగలరన్నారు. ఇంటి పరిసరాలలో మురుగునీరు, వర్షపు నీరు నిలువ లేకుండా చూసుకోవాలన్నారు. ముఖ్యంగా చేతి పంపులు, మంచినీటి కుళాయిలు, పైప్లైన్ల వద్ద మురుగునీరు లేకుండా చూసుకోవలసిన బాధ్యత ప్రజలపైనే ఉందన్నారు. పైప్ లైన్లు లీకేజీ అయినప్పుడు వర్షపు నీరు, మురుగునీరు మంచినీటిలో కలుషితమైతే ప్రజలు ఆనీరు తాగడం వల్ల అనారోగ్యానికి గురి కావడం జరుగుతుందన్నారు. మండల పరిషత్ నిధులతో డ్రైనేజీ ఏర్పాటు చేపట్టినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నేతలు జక్కంపూడి నాగభూషణం, ఉమ్మాల చంద్రశేఖర్, బిజెపి నాయకులు కావేటి మల్లికార్జున, సచివాలయ ఇంజనీర్ శివశంకర్, కుమ్మర సాంబశివుడు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**బత్తలపల్లి, జూన్ 18 ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని పలు కాలనీలలో విద్యుత్ లైన్ మరమ్మతుల దృష్ట్యా సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్కో ఏఈ శివయ్య తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బత్తలపల్లిలోని తహసిల్దార్ కార్యాలయం, ఆర్డిటి ఆసుపత్రి, పాతవూరు, ఎస్టి కాలనీ, ఎస్సీ కాలనీ, ఇందిరమ్మ కాలనీ, కోటి కాలనీ, కదిరి రోడ్, ధర్మవరం రోడ్, తాడిమర్రి రోడ్ జగనన్న కాలనీలలో లైన్ మరమ్మతుల దృష్ట్యా సరఫరా ఉండదన్నారు. గురువారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు కరెంటు సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్కో ఏఈ శివయ్య తెలిపారు.

## అధికారుల నిర్లక్ష్యం వల్ల అర్హులకు సంక్షేమ పథకాలు అందడం లేదు

### ఆవేదన వ్యక్తం చేసిన ప్రజా ప్రతినిధులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ బగ్గిరి త్రివేణి

**బత్తలపల్లి, జూన్ 18 ప్రభాతవార్త**

రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే అర్హులకు, నిరుపేదలకు సంక్షేమ పథకాలు అందకుండా పోతున్నాయని పలువురు ప్రజా ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ బగ్గిరి త్రివేణి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సమావేశానికి కొందరు అధికారులు గైర్హాజర్


సమావేశానికి హాజరైన అదికారులు, ప్రజా ప్రతినిధులు

కావడంతో వారిపైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్కు ప్రతిపాదనలు పంపాలని తీర్మానించారు. అనంతరం ఆయా శాఖల అధికారులు తమ శాఖల ప్రగతిని వివరించారు. అందులో భాగంగా గత ప్రభుత్వంలో పూర్తికాని ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని హౌసింగ్ ఏఈ విశ్వనాథ్ వివరించారు. ఇందుకు స్పందించిన దంపెట్ల సర్పంచు చల్లా కరుణాకర్నాయుడు స్పందిస్తూ కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది పూర్తి అయినా ఇంత వరకు ఒక్క ఇల్లు కూడా మంజూరు చేయలేదని నిలదీశారు. అదేవిధంగా సిఎస్డిటి రామకృష్ణ పౌరసరఫరాల గురించి వివరించారు. తహసీల్దార్ స్వర్ణలత సమావేశాలకు హాజరు కావడంలేదని, ప్రజా ప్రతినిధులు. లెక్కలేనితనంగా ఉందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రీ సర్వే లోపాలపై కీలక ప్రశ్నలు సందించారు. సర్వేలో జరిగిన పొరపాట్ల కారణంగా రైతు కుటుంబాలకు, ఎస్సీ, ఎస్టీలకు తల్లికి వందనం. సుఖీభవ పథకాలు, సంక్షేమ పథకాలకు దూరమవుతున్నాయని సర్పంచు కరుణాకరేయుడు, ఎంపీపీ బగ్గిరి త్రివేణి నిలదీశారు. ముఖ్యంగా ఒక మహిళా రైతుకు సంబందించి 57 సెంట్లు మాత్రమే ఉన్న భూమిని సర్వేలో 37 ఎకరాలుగా చూపించడం వల్ల ఆమెకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందడం లేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందుకుగాను 37 ఎకరాల భూమిని అయినా ఆ రైతుకు చూపించండి. లేదా.. నష్టపోయిన ఆమెకు న్యాయం చేయాలన్నారు. ఇలాంటి వారు మండల వ్యాప్తంగా చాలా మంది ఉన్నారని నిలదీశారు. సంక్షేమ పథకాలు అర్హులైన లబ్దిదారులకు చేసేలా చూడాలని, ఇందుకోసం సర్వే లోపాలను తక్షణమే సరిదిద్దాలని అధికారులను కోరారు. చంపెట్ల పంచాయతీలోని స్కీం బోర్డుకు ఉన్న మోటారు కేబుల్ వైర్లు పలుమార్లు దొంగతనం జరిగినా పోలీసులను ఆశ్రయిస్తే కేసు నమోదు చేయడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీఓ ఆదెప్ప ఉపాది హామీ పని గురించి వివరించగా రైతులను కూలీలుగా మారకుండా వారికి ఇవ్వాల్సిన బిల్లులు వెంటనే చేయాలన్నారు. ఉపాధిహామీ పథకంలో రైతులకు వివిధ నిర్మాణాలు చేపట్టి వాటికి బిల్లులు చెల్లించకపోతే ఎలా అంటూ నిలదీశారు. అనంతరం ఆయా శాఖల అధికారులు తమ శాఖల ప్రగతిని వివరించారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీలు గజ్జెల వెంగళరెడ్డి. సాకే పార్వతి, ఈఓఆర్డీ క్రిష్టప్ప, సర్పంచులు చల్లా కరుణాకర్నాయుడు. సానే జయచంద్రారెడ్డి, మాదిరెడ్డి పద్మావతమ్మ. శారదమ్మ, ప్రభాకరరెడ్డి, బత్తినన్న, ఎంపీటీసీ సభ్యులు కోటి నరేష్ కుమార్, తప్పెట ఆంజనేయులు, మండల మంజుల, బండి రమణమ్మ. కో ఆప్షన్ మెంబర్ కరింసాబ్, ట్రాన్స్కో ఏఈ శివయ్య, పశువైద్యాధికారి గుర్నాథరెడ్డి, ఏపీఎం హరిప్రసాద్, ఎంఈఓ, చాముండేశ్వరి, సెరికల్చర్ అధికారి లక్ష్మన్న, ఏఎస్ఓ డార్టర్ లక్ష్మీనరసింహాశర్మలతో పాటు పంచాయతీ కార్యదర్శులు, పీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

## యోగాపై ప్రత్యేక శిక్షణ

**రామగిరి, జూన్ 18 ప్రభాతవార్త**

మండలంలోని పలు పాఠశాలలోయోగాపై ఉపాధ్యాయులు శిక్షణ ఇస్తున్నారు. యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 21 పెద్ద ఎత్తున యోగా కార్యక్రమాలు చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు. కొత్తగాదికుంటలో అన్నం అరవిందు అనే ఉపాధ్యాయుడు విద్యార్థులకు యోగాపై శిక్షణ ఇచ్చారు. యోగా వల్ల కలిగే ఉపయోగాల గురించి వివరించారు. ఆరోగ్యం, మానసిక ప్రవర్తన, ఏకాగ్రత ఆరోగ్యకర ఉపయోగాల గురించి వివరించారు. ఆరోగ్యం, మానసిక ప్రవర్తన, ఏకాగ్రతత ఆరోగ్యకర ఉపయోగాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం హేమలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


యోగా చేస్తున్న విద్యార్థులు

## గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం

**కొత్తచెరువు జూన్18 ప్రభాతవార్త.**

శ్రీ సత్య సాయి జిల్లా కొత్తచెరువు శ్రీ సత్య సాయి ప్రభుత్వ జూనియర్ కళాశాల లో ఖాళీగా ఉన్న వృక్ష శాస్త్రము , అర్థశాస్త్రం గెస్ట్ లెక్చరర్ పోస్టులకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ జ్యోతిర్లత ఓ ప్రకటనలో తెలిపారు

## ఏడాదిలో మోసపూరిత పాలన కూటమి ప్రభుత్వ పాలనపై ధ్వజమెత్తిన వైసీపీ నాయకులు

### జగన్ అంటే నమ్మకం బాబు అంటే మోసం పుస్తకావిష్కరణ


మహాత్మా గాంధీకి పూలమాలలు వేస్తున్న వైసిపి నాయకులు

**పెనుకొండ జూన్ 18 ప్రభాతవార్త**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కాలంలో మోసపూరిత పాలన కొనసాగించారని వైసిపి నాయకులు ధ్వజమెత్తారు. బుధవారం నాడు పట్టణంలో మహాత్మా గాంధీ సర్కిల్లో ఆత్మ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి జగన్ అంటే నమ్మకం బాబు అంటే మోసం రచించిన పుస్తకాన్ని వైసీపీ నాయకులు పుష్కరించారు తదనంతరం జరిగిన సభలో మండల కో కన్వీనర్ కురబవాండ్లపల్లి చెన్నకేశవులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఎన్నికలలో ఇచ్చిన హామీలను తుంగలోకి తొక్కారన్నారు. సూపర్ సిక్స్ హామీలలో అరకొరాగా అమలుపరిచారన్నారు తల్లికి వందనం పథకంలో 15 వేల రూపాయలు ఇస్తారని 13 వేల రూపాయలు అందించారు అన్నారు అర్హులైన వారందరికీ తల్లికి వందనం వర్తింప చేయలేదన్నారు. రాష్ట్రంలో లోకేష్ రచించుకున్న రెడ్ బుక్ రాజ్యాంగం అమలు జరుగుతున్నదన్నారు వైసీపీ నాయకులు కార్యకర్తలపై నిరంతరంగా కేసులు నమోదు చేస్తూ వేదంపలకు గురి చేస్తున్నారన్నారు తెలుగుదేశం నాయకులకు సంపాదన వైసీపీ నాయకుల ను వేధించడమే అజెండాగా పెట్టుకున్నారన్నారు కార్యక్రమాలలో వాల్మీకి కార్పొరేషన్ మాజీ చైర్మన్ పొగాకు రామచంద్ర మండల కన్వీనర్ సుధాకర్ రెడ్డి పట్టణ కన్వీనర్ నరసింహులు వైసిపి నాయకులు గోపాల్ రెడ్డి రాంపురం అంజి చిన్న ఆంజనేయులు నాగులూర్ బాబు కొండల రాయుడు లు పాల్గొన్నారు

## పొలం పిలుస్తోందిపై అవగాహన

**అగళి, జూన్ 18 ప్రభాతవార్త**


అవగాహన కల్పిస్తున్న ఏఓ

మండల పరిధిలోని ఆర్జి హళ్లి రైతు సేవా కేంద్రంలో బుధవారం మండల వ్యవసాయ అధికారి నాగరాజు రైతులకు అవగాహన కల్పించారు. 2025 ఖరీఫ్లో రైతులు ఎవరైనా వేరుశనగను రైతు సేవా కేంద్రం నుంచి తీసుకున్నారో వారు తప్పకుండా నమోదు చేయించుకోవాలన్నారు. అన్నదాత ఇకెవైసి కూడా చేయించుకోవాలని తెలిపారు. రైతులు ఎరువుల దుకాణంలో ప్రభుత్వం నిర్దారించిన సరుకు మాత్రమే ఎరువులను కొనుగోలు చేయాలని, అధిక ధరలు వసూలు చే స్తే చర్యలు తప్పవన్నారు. అధిక ధరలకు విక్రయించే వ్యాపారులపై తమకు ఫిర్యాదు చేయాలన్నారు. రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు అందుబాటులో ఉంచుతామని తెలిపారు. ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు ఆసక్తి చూపాలని, రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గిస్తూ సేంద్రీయ ఎరువుల విధానాన్ని అలవర్చుకోవాలని తద్వారా మంచి పంటల దిగుబడి వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## లీగల్ క్యాంప్


అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**రామగిరి, జూన్ 18 ప్రభాతవార్త**

టింబక్టు కలెక్టివ్ సహకారంతో ప్రతిభా వికలాంగుల సొసైటీ ఆధ్వర్యంలో లీగల్ క్యాంపును పిఆర్ కొట్టాల గ్రామంలో నిర్వహించగ గ్రామ ప్రజలు మహిళాలు, వికలాంగులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో వికలాంగుల చట్టాలు, మేనరిక వివాహాలు వారు పడుతున్న బాధలు గురించి సంఘంపైన అవగాహనా నాటికన కల్పించారు. ఈ సమావేశానికి సుమారు 50 మంది సభ్యులు పాల్గొన్నారు. అలాగే కోఆర్డినేటర్ గణేష్ అసోసియేట్ డోమినిన్ ప్రతిభ సొసైటీ డైరెక్టర్ మధు మిలిత సిబ్బంది పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే పల్లెనిద్ర వినతిపై స్పందించిన తహసిల్దార్

### బీసీ ఎస్సీలకు స్మశాన స్థలం కేటాయింపు

**అమరాపురం జూన్ 18 ప్రభాతవార్త**

మండల పరిధిలో వి అగ్రహారం గ్రామం నందు మంగళవారం రాత్రి మడకశిర ఎమ్మెస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామిలు పల్లెనిద్ర కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామంలో ఎస్సీ, బిసిల వారికి స్మశాన వాటిక లేదని ఫిర్యాదు రావడంతో తక్షణం ప్రభుత్వ స్థల పరిశీలన చేసి న్యాయం చేయాలని తహసిల్దార్ లక్ష్మీనరసింహం కు ఎమ్మెల్యే సూచించారు. ఎమ్మెల్యే ఆదేశాలతో స్పందించిన తహసిల్దార్ బుధవారం సంబంధిత విఆర్వోలు మరియు సర్వే సిబ్బందితో ప్రభుత్వ భూమిపై అన్వేషణ చేశారు. గ్రామంలోని స్థానిక నాయకులు, గ్రామప్రజలు సమక్షంలో స్మశాన వాటిక స్థలం గుర్తించి సర్వే నం.3603తీ విస్తీర్ణం 3.25 సెంట్లు గల స్థలం రికార్డు మేరకు స్మశాన వాటిక భూమిని గుర్తించినట్లు తహసిల్దార్ తెలిపారు. ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీల ఆదేశాల మేరకు ఎస్సీ సామాజిక వర్గానికి 1.50 ఎకరంలో, బీసీ సామాజిక వర్గానికి 1.75 ఎకరముల భూమిని స్మశాన వాటిక లకు కేటాయించడం జరిగిందని తహసీల్దార్ గ్రామ ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ధనుంజయ, టిఎన్ఎస్ఎఫ్ కార్యదర్శి నవీన్ కుమార్, వీఆర్వో రవికుమార్ ,సీనియర్ టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.


స్థల పరిశీలన చేస్తున్న దృశ్యం

## బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యే పరిటాల సునీత


బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

**రామగిరి, జూన్ 18 ప్రభాతవార్త**

రాప్తాడు నియోజకవర్గం, రామగిరి మండలం, కలికివాండ్లపల్లి గ్రామానికి చెందిన భార్యా భర్తలైన ఎనుముల ముసలప్ప, ఎనుముల ముత్యాలమ్మ దంపతులు గత వారంలో దాదులూరు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి అనంతపురం నగరంలోని సవేరా ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా రాప్తాడు శాసనసభ్యురాలు పరిటాల సునీత వెళ్లి వారిని పరామర్శించారు. వైద్యులతో వారి ఆరోగ్య పరిస్థితిపై చర్చించి మెరుగైన వైద్యాన్ని అందించాలని సూచించడంతో పాటు ఆర్థిక సహాయం అందించారు. ఎమ్మెల్యేతోపాటు పలువురు ఉన్నారు.

## శనగపచ్చ పురుగు, పచ్చదోమ నివారణకు చర్యలు తీసుకోండి

### - చిన్నముష్టూరు, పెద్దముష్టూరు పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఏవో బి.రామకృష్ణుడు


పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న ఏవో, రైతులు

**ఉరవకొండ, జూన్ 18 ప్రభాతవార్త**

వేసవిలో బోరు, బావుల కింద సాగు చేసిన 4 నెలల పంట కాలం కల్గిన ప్రస్తుతం 80 నుండి 90 రోజుల మధ్య వయసుగల ట్యాగ్ 24 రకం వేరుశెనగ పంటలో శనగపచ్చ పురుగు, పచ్చదోమ నివారణకు చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి బి.రామకృష్ణుడు సూచించారు. మండల పరిధిలోని చిన్నముష్టూరు, పెద్దముష్టూరు గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించి వేరుశెనగ పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో బి.రామకృష్ణుడు మాట్లాడుతూ శనగపచ్చ, పచ్చదోమ నివారణకుగాను లామ్డా సహలోత్రిన్ 2ఎంఎల్ మందును ఒక లీటరు నీటిలో కలిపి, తయోమిత్సాగ్జం ఒక గ్రాము మందును కలిపి ఎకరాకు 150 లీటర్ల నీటిలో 300 ఎంఎల్ చొప్పున పిచికారి చేయాలన్నారు. పంటకు తిక్క ఆకుమచ్చ, బూజు తెగుళ్ళు సోకే అవకాశం ఉందని దీని నివారణకు టెబుకొనుజోల్ ఒక ఎంఎల్ మందును ఒక లీటరు నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న వివిధ పథకాల గూర్చి వివరించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రైతు సేవా కేంద్రాల సిబ్బంది, వ్యవసాయశాఖ, మార్కెటింగ్శాఖ సిబ్బంది పాల్గొన్నారు.


రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో బి.రామకృష్ణుడు

## పంటలకు గిట్టుబాటు ధర కల్పించి ఆత్మహత్యలు నివారించడంతో ప్రభుత్వాలు విఫలం

### - జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహం ముందు కౌలు రైతు సంఘం నిరసన



జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహం ముందు నిరసన తెలుపుతున్న కౌలు రైతుల సంఘం

**ఉరవకొండ, జూన్ 18 ప్రభాతవార్త**

రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయని కౌలు రైతు సంఘం విమర్శించింది. ప్రభుత్వా లు అనుసరిస్తున్న నిర్లక్ష్యం కారణంగా రాష్ట్రంలో రైతులు, కౌలు రైతుల ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయంటూ పట్టణంలోని స్థానిక మండల పరిషత్ కార్యాలయం ముందుగల జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహం ముందు కౌలు రైతు సంఘం నిరసన తెలిపింది. ఈ సందర్భంగా కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు రంగారెడ్డి, నియోజకవర్గ అధ్యక్ష కార్యదర్శులు సురేష్, వెంకటేష్ మాట్లాడుతూ పొగాకు, మిర్చి, పత్తి పంటలకు గిట్టుబాటు ధరలులేక రాష్ట్ర వ్యాప్తంగా రైతులు, కౌలు రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. వ్యవసాయ కోసం తెచ్చిన అప్పులు తీర్చలేక తీవ్ర మానసిక ఒత్తిడులకు గురై మంగళవారం ఒక్కరోజే పల్నాడు జిల్లాలోని మండలం కౌలు రైతులు కొండయ్య, గోపాల్రావు, ఆదినారాయణ, అనంతపురం జిల్లాలోని గుంతకల్లు మండలం నల్లదాసరి పల్లికు చెందిన సర్పంచ్ పార్వతి భర్త నాగలింగ ఆత్మహత్య చేసుకున్నారన్నారు. గిట్టుబాటు ధరల కోసం రైతులు ఆందోళనలు చేస్తున్నా కేంద్రం స్పందించడం లేదన్నారు. ఇటీవల కేంద్ర మంత్రి పియూష్ గోయల్ పర్యటనలోనూ నిర్దిష్టమైన హామీ ఇవ్వలేదన్నారు. మరోవైపు ముఖ్యమం త్రి నారా చంద్రబాబునాయుడు, వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు వివిధ కంపెనీలతో చర్చలు జరిపి ఇచ్చిన హామీను వ్యాపారస్థులు అమలు చేయడం లేదన్నారు. వెంటనే పంటలకు గిట్టుబాటు ధర కల్పించి ఆత్మహత్యలకు పాల్పడ్డ కౌలు రైతుల కుటుంబంలోని ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వడంతోపాటు 20 లక్షల రూపాయల వంతున ఎక్స్గ్రేషియా ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం మండల నాయకులు అశ్వర్థ, సుంకన్న, బజారప్ప, సుంకన్న, ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

## ఆదర్శపాఠశాలలో 14 మంది బదిలీ..

### - బదిలీల స్థానంలో పూర్తిస్థాయి సిబ్బందిని నియమించాలి

**అగలి, జూన్ 18 ప్రభాతవార్త**

అగళి ఆదర్శపాటశాల, జూనియర్ కళాశాలలో పని చేస్తున్న 14 మంది ఉపాధ్యాయులు ఇతర పాఠశాలలకు బదిలీ అయ్యారని ఎంఇఓ చంద్రశేఖర్నాయుడు తెలిపారు. అలాగే బదిలీ అయిన స్థానంలో ఏడు మంది ఉపాధ్యాయులు ఇతర పాఠశాలల నుంచి ఆదర్శ పాఠశాలలకు నియమించారని తెలిపారు. అగళి మండలం అటు ఉమ్మడి అనంతపురం కేంద్రానికి, ఇటు సత్యసాయి జిల్లా కేంద్రానికి సుదూరంలో ఉన్న ఒక విసిరేసినట్లు అగళి మండలం ఉంది. ఇక్కడ ఉపాధ్యాయులు ఉన్నవారు బదిలీ అయితే పాఠాలు బోధించేవారు ఎక్కడ అని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. 14 మంది బదిలీ అయిన స్థానంలో 7 మందిని మాత్రమే నియమించారని, ముగిలిన ఏడు మందిని కూడా ఆదర్శ పాఠశాలలో బర్తీ చేయాలని జడ్పిటిసి ఉమేష్, మడకశిర మార్కెట్యార్డు డైరెక్టర్ ఎంఆర్ శివరాములు కోరారు.

## తల్లికి వందనం

### - 3.95 కోట్లు జమా - ఇంకా 76 మందికి పడాల్సి ఉంది

**అగళి, జూన్ 18 ప్రభాతవార్త**

అగళి మండలంలో తల్లికి వందనంలో భాగంగా ఇప్పటి వరకు 3.95 కోట్లు తల్లుల ఖాతాల్లోకి జమా అయినట్లు ఎంఇఓ చంద్రశేఖర్నాయుడు తెలిపారు. అదే విధంగా ఇంకా మండలంలో 76 మంది విద్యార్థులకు తల్లికి వందనం డబ్బులు జమా కాలేదని, అర్హత ఉండి, యాక్టులో ఉన్నాయి కావున ఈ 76 మందికి కూడా త్వరలోనే తల్లుల ఖాతాల్లోకి డబ్బులు జమా అవుతాయని ఎంఈఓ చంద్రశేఖర్నాయుడు తెలిపారు.

## ఉచిత ఆరోగ్య బీమా కార్డులపై అవగాహన

**గుంతకల్లు, జూన్ 18 ప్రభాతవార్త**


ఉచిత ఆరోగ్య బీమా కార్డులపై అవగాహన కల్పిస్తున్న వడ్డే రమేష్

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ ఉచిత ఆరోగ్య బీమా కార్డులపై బిజెపి పట్టణ శాఖ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పాత గుంతకల్లులోని అంకాలమ్మ దేవాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమాన్ని ఉద్దేశించి పట్టణ అధ్యక్షులు వడ్డే రమేష్ మాట్లాడుతూ 70 ఏళ్ళు పైపడిన వృద్ధులు ప్రతి ఒక్కరూ ఉచిత ఆరోగ్య బీమా కార్డులను పొందాలన్నారు. పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్న సదుద్దేశంతో 2018లో ఈ పథకాన్ని ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. దేశవ్యాప్తంగా 56 కోట్ల మంది, రాష్ట్ర వ్యాప్తంగా 1.56 లక్షల మంది ఈ బీమా ద్వారా లబ్ధి పొందుతున్నారని పేర్కొన్నారు. ఆయా వార్డుల్లోని సచివాలయాల్లో ప్రతి ఒక్కరు దరఖాస్తు చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు కొలిమి రామాంజనేయులు, 7వ వార్డు సచివాలయం ఏఎన్ఎం అయేషా, ఆశా వర్కర్ గౌరి, తదితరులు పాల్గొన్నారు.

## యోగాంధ్రలో గుత్తివాసి విజయభాస్కర్కు ద్వితీయ స్థానం


రాష్ట్రస్థాయిలో బహుమతి పొందిన విజయభాస్కర్ (ఫైల్ ఫోటో)

**గుత్తి, జూన్ 18 ప్రభాతవార్త**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మక చేపట్టిన అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో గుత్తికి చెందిన విజయభాస్కర్చౌదరి ద్వితీయ స్థానాన్ని సాధించారు. వెటరన్ విభాగంలో ఆయన షార్ట్ ఫిలిం విభాగంలో రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానం సాధించారు. ఈ పోటీలు విజయవాడలోని డాన్ బాస్కో స్కూల్లో జరిగాయి. తనకు సహకరించిన మున్సిపల్ కమీషనర్ జబ్బార్మియాకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## సిపిఎం ఆధ్వర్యంలో రాస్తారోకో

**గుత్తి, జూన్ 18 ప్రభాతవార్త**



రాస్తారోకో చేస్తున్న దృశ్యం

గుత్తి పట్టణంలోని బిసి కాలనీ, వీరారెడ్డి కాలనీల్లో సిమెంట్ రోడ్లు నిర్మించాలని డిమాండ్ చేస్తూ బుధవారం సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో స్థానిక గాంధీచౌక్ వద్ద ఆ పార్టీ కార్యకర్తలు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా రహదారులు జలమయమై ప్రమాదాలకు కారణమవుతున్నాయని వారు ఆరోపించారు. అదేవిధంగా గుత్తి గర్ల్స్ హైస్కూల్ వద్ద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ, రేణుక, మల్లికార్జున, అశోక్, చందు, రేవతి, కవిత, తదితరులు పాల్గొన్నారు.

## ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ తనిఖీ చేసిన డిప్యూటీ కమిషనర్..

**ధర్మవరం రూరల్ జూన్ 18 ప్రభాతవార్త**


రికార్డులను పరిశీలిస్తున్న డిప్యూటీ కమిషనర్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న నవోదయం 2.0 లో భాగంగా బుధవారం ధర్మవరం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ ను ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమీషనర్ నాగమద్దయ్య అకస్మాత్తుగా తనిఖీ చేసారు. స్టేషన్ లోని పలు రికార్డులను పరిశీలించినారు. పెడింగ్ లో ఉన్న సారాయి కేసులోని ముద్దాయిలను త్వరగా అరెస్ట్ చేయాలని నవోదయం 2.వీ లో భాగంగా ధర్మవరం ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని వివిధగ్రామాలలో సారాయి రహిత గ్రామాలుగా తీర్చిదిద్దడానికి అందరూ సమిష్టి కృషి చేయాలి అని సిబ్బందికి తెలియజేశారు. ఈ తనిఖీలో అసిస్టెంట్ సూపరింటెంట్ శ్రీరామ్, ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ చంద్రమణి, సబ్ ఇన్స్పెక్టర్ చాంద్ బాష నాగరాజు, సిబ్బంది ఉన్నారు.

## వివిధ శుభ కార్యాల్లో పాల్గొన్న రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు

**అగళి, జూన్ 18 ప్రభాతవార్త**


వధువరులను ఆశీర్వదిస్తున్న రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు

రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు, తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ గుండుమల తిప్పేస్వామి సుడిగాలి పర్యటన చేశారు. వివిధ శుభకార్యాల్లో పాల్గొన్నారు. ఇరిగేపల్లి మాజీ ఎంపిపి మల్లిక అన్న కూతురు వివాహానికి హాజరై వధువరులనూ ఆశీర్వదించారు. అదే విధంగా పి.బ్యాడిగెర మాజీ సర్పంచు మంజునాథ్, మను వరాలి నామకరణ మహోత్సవానికి హాజరై చిన్నారిని ఆశీర్వదించారు. నియోజకవర్గంలో పెళ్లిళ్లు, నామకరణాల కార్యక్రమంలో గుండుమల తిప్పేస్వామి పాల్గొని బిజీ బిజీగా గడిపారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి ఉమేష్, మార్కెట్యార్డు డైరెక్టర్ ఎంఆర్.శివరాములు, మాజీ సింగిల్ విండో అధ్యక్షులు శ్రీనివాస్, సర్పంచు లక్ష్మమ్మ, లింగరాజు, మండల ఉపాధ్యక్షులు గాయత్రి హేమంత్, ఎంపిటిసి సురేష్, టిడిపి నాయకులు జయరామ్, శివన్న, మాజీ సర్పంచు తమ్ముడు దేవరాజ్, రమేష్, రాజ్గోపాల్, రాజేగౌడ, హరీష్, మాజీ సర్పంచు లింగన్న, కామరాజు, తిప్పేస్వామి, సునీల్ రంగారెడ్డి, రామచంద్రప్ప, కృష్ణరెడ్డి, హనుమప్ప తదితరులు పాల్గొన్నారు.


నామకరణ కార్యక్రమంలో గుండుమల

09ATP27_09ATP27.qxd 18-06-2025 PM 11:14 Page 1



## నేడు పేదల దేవుడు ఫెర్రర్ వర్ధంతి

బత్తలపల్లి, జూన్ 18 ప్రభాతవార్త



బత్తలపల్లిలోని ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ ఘాట్

ఆర్డీటి వ్యవస్థాప కులు ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ 16వ వర్ధంతిని వైభవంగా నిర్వహిం చేందకు శరవేగంగాపనులు జరుగుతు న్నాయి. గురువారం మండల కేంద్రమైన బత్తలపల్లిలోని ఫెర్రర్ ఘాట్ వద్ద వర్ధంతిని జరుపుకుం టున్నారు. బత్తలపల్లి మండలంలోని నిరుపేదలకు ఇల్లు. వైద్యం, విద్య ఉచితంగా అందిస్తూ వారి హృదయాలలో దేవుడిగా నిలిచిపోయారు గ్రామగ్రామాన ఫెర్రర్ వర్ధంతిని వెనుకబడిన వర్గాల ప్రజలు నిర్వహించ డానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. బత్తలపల్లిలోని ఫెర్రర్ ఘాట్ వద్ద గురువారం సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆర్డీటి వర్గాలు పేర్కొన్నాయి. ఆర్డీటి సిబ్బంది. ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొననున్నారు. అదేవిధంగా ఎఫ్సీఆర్ఎ రెన్యూవల్ చేయాలని కోరుతూ మండలంలోని వివిధ గ్రామాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున స్వచ్ఛందంగా తరలివచ్చి ఫెర్రర్ ఘాట్ వద్ద నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించి. కూడలిలో మానవహారంగా నిల్చుకొని నిరసన వ్యక్తం చేయనున్నట్లు తెలిసింది.

## బైకు నుంచి కిందపడి వ్యక్తి మృతి

బత్తలపల్లి, జూన్ 18 ప్రభాతవార్త



రమేష్ (ఫైల్ ఫోటో)

అనారోగ్యంతో బాధపడుతున్న తమ్ముడిని ఆసుపత్రికి ద్విచక్రవాహనంలో తీసుకొని వస్తుండగా వాహనంలో.. నుంచి అదుపుతప్పి కిందపడి తమ్ముడు మృతి చెందిన సంఘటన మండలంలోని దంపెట్ల గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. తమ్ముడు పొత్తూరి వెంకటగిరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. దంపెట్ల గ్రామానికి చెందిన పొత్తూరి. వెంకటస్వామి కుమారుడు రమేష్ (39) అనారోగ్యంతో బాధపడుతున్నట్లు తెలిపారు. ఆయనను ద్విచక్రవాహనంలో ఎక్కించుకుని అన్న వెంకటరమణ బత్తలపల్లి ఆర్డీటి ఆసుపత్రికి బయలుదేరారు. గ్రామ చివరన నాగేశ చంద్రశేఖర్ నాయుడు ఇంటి వద్దకు రాగానే అతివేగంగా, అజాగ్రత్తగా వాహనం నడుపుట వలన ద్విచక్రవాహనంలో వెనుక కూర్చున్న రమేష్ కిందపడి అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. మృతునికి వివాహం కాలేదన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని వివరాలు ఆరా తీశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

## బొలెరోను ఢీకొన్న కారు
### తృటిలో తప్పిన పెను ప్రమాదం



ప్రమాదానికి కారణమైన ఇన్నోవా కారు

బత్తలపల్లి, జూన్ 18 ప్రభాతవార్త

జాతీయ రహదారిపై గుమ్మల్లకుంట క్రాస్ సమీపం లో బుధవారం సాయంత్రం బొలెరోవాహనంను వెనుక నుంచి కారు ఢీ కొన్న ప్రమాదంలో తృటిలో పెను ప్రమాదం తప్పింది. బత్తలపల్లి పోలీసులు తెలిపిన సమాచారం మేరకు.. తిరుపతి నుంచి అనంతపురంకు వ్యక్తిగత పనులపైన ఇనోవా కారులో డ్రైవర్ దినేష్ తో పాటు మరోవ్యక్తి వస్తున్నారు. వీరి వాహనం బత్తలపల్లి మండలం గుమ్మల్లకుంట క్రాస్ వద్దకు రాగానే కుక్కదూరడంతో దానిని తప్పించే ప్రయత్నంలో ముందు టమోటా లోడుతో అనంతపురం వెలుతున్న బొలెరో వాహనంను వెనుక నుంచి ఢీ కొంది. ఈ ప్రమాదంలో కారులోని బెలూన్లు ఒపెన్ కావడంతో కారులో వెలుతున్న వారు స్వల్పగాయాలతో బయటపడ్డారు. బొలెరో వాహనం కొద్దిగా అదుపుతప్పినా డ్రైవర్ నియంత్రణలోకి తెచ్చినట్లు తెలిపారు. ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

## ఎమ్మెల్యే చేతులు మీదుగా నిరుపేదలకు బియ్యం పంపిణీ



బియ్యం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

కదిరి, జూన్ 18 ప్రభాతవార్త

పట్టణంలోని పివిఆర్ ఫంక్షన్ హాల్‌లో మాజీ సర్పంచు ఊరతి చంద్ర, పివిఆర్ గణేష్ ఆధ్వర్యంలో నిరుపేద కుటుంబాలకు ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ చేతులు మీదుగా బియ్యం బస్తాలను బుధవారం పంపిణీ చేశారు. 50 మంది నిరుపేద కుటుంబాలకు ఒక్కొక్కరికి 50 కెజిల సన్నబియ్యాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి రూరల్ మండల కన్వీనర్ చెన్నకేశవులు, నల్లచెరువు మండల కన్వీనర్ రాజశేఖర్, జయచంద్ర, ఆదిరెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి, శ్రీకాంత్‌నాయక్‌లు పాల్గొన్నారు.

## ఆలయ నిర్మాణానికి చేయూత

నార్పల జూన్ 18, ప్రభాతవార్త

నార్పల మండలం దుర్గం గ్రామం లోని శ్రీ అహోబిల లక్ష్మీనరసింహస్వామి ఆలయ నిర్మాణమునకు కీర్తిశేషులు శ్రీ సాకే పెద్ద మారన్న గారి మూడవ కుమారుడైన విశాఖపట్నంలోని నేవీలో ఉద్యోగం చేస్తున్న శ్రీ సాకే ప్రభాకర్ 752070 ( ఏడు లక్షల యాభై రెండు వేల డెబ్బాయ్) రూపాయలను శ్రీ అహోబిల లక్ష్మీనరసింహస్వామి చారిటబుల్ ట్రస్ట్ సభ్యులకు బుధవారం విరాళం ఇచ్చారు. ఈ సందర్భంగా సాకే ప్రభాకర్ మాట్లాడుతూ లక్ష్మీనరసింహస్వామి నూతన ఆలయానికి ఈ నగదు మొత్తం విరాళం ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. నూతన ఆలయ నిర్మాణానికి మరింత సహాయ సహకారాలు అందిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో సాకే చిన్న మారెన్న, సాకే మల్లికార్జున, సాకే శివానంద,సాకే రామాంజనేయులు పాల్గొన్నారు.

## ప్రజా ప్రయోజనార్థం వదిలిన భూమిని పరిరక్షించండి

- తహశీల్దార్ మహబూబ్‌బాషాకు విన్నవించిన పలువురు



తహశీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

ఉరవకొండ, జూన్ 18 ప్రభాతవార్త

పట్టణంలోని అనంతపురం-బళ్లారి జాతీయ రహదారికి పక్కనగల సర్వే నంబర్ 538/పిలోని ఎల్పీ నంబర్ 77/96లో ఉరవకొండ మేజర్ గ్రామ పంచాయతీకు వదలబడిన 36 సెంట్ల భూమిని పరిరక్షించాలని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ డివిజినల్ సభ్యులు కౌకుంట్ల రవి, మేజర్ పంచాయతీ వార్డు సభ్యులు మీనుగ రవి, పట్టణానికి చెందిన బి.గోపాల్, రమేష్ కోరారు. బుధవారం స్థానిక మండల తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ ఎస్.మహబూబ్‌బాషాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సదరు ఎల్పీ నంబర్‌లోని సాగు భూమిని హైదరాబాద్ లేఅవుట్‌గా మార్చి అందులో ప్లాట్లు వేయడం జరిగిందన్నారు. ఈ సర్వే నంబర్‌లోని భూమిని కొలతలు వేయాలని ఎవరైనా అడిగితే ప్రజా ప్రయోజనాలకోసం వదిలిన భూమిని మినహాయించి కొలతలు వేయాలని కోరారు.

## ప్రభుత్వాసుపత్రిలో బీటీ రోడ్ నిర్మాణానికి భూమిపూజ.

ధర్మవరం రూరల్ జూన్ 18 ప్రభాతవార్త

ధర్మవరం ప్రభుత్వాసుపత్రిలో ప్రజలకు మెరుగైన రవాణా సదుపాయాలను అందించేందుకు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ సహకారంతో నూతనంగా నిర్మించబోయే బ్లాక్‌టాప్ (బీటీ) రోడ్ పనులకు బుధవారం మంత్రి నియోజకవర్గ ఇన్చార్జ్ హరీష్ బాబు ఆసుపత్రి సూపరింటెండెంట్ మరియు వైద్య సిబ్బందితో కలిసి భూమిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి నియోజకవర్గ ఇన్చార్జ్ హరీష్ బాబు మాట్లాడుతూ ఆసుపత్రిలో రోజుకు వేలాది మంది రోగులు వస్తుండగా, రోడ్డు సదుపాయం వర్షాకాలంలో అత్యంత దయనీయ స్థితిలో ఉండటం వల్ల రోగులు, వారి బంధువులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రజల విజ్ఞప్తి మేరకు, మంత్రి వెంటనే స్పందించి బీటీ రోడ్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారని ఆయన తెలిపారు. ఆసుపత్రి పరిసరాల్లో తగిన రహదారి సౌకర్యం ఉండకపోవడం వల్ల ప్రజలకు ఎదురవుతున్న ఇబ్బందులను తొలగించేందుకే ఈ రోడ్డు నిర్మాణం చేపట్టబడుతోంది. మంత్రి మార్గదర్శకతలో ధర్మవరం ప్రభుత్వాసు పత్రిని అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తున్నాం. రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయనున్నాం, అని పేర్కొన్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్, డాక్టర్లు, ఇతర వైద్య సిబ్బంది, ప్రభుత్వానికి, మంత్రి సత్య కుమార్ యాదవ్ కు కృతజ్ఞతలు తెలిపారు. ధర్మవరం ప్రజల ఆరోగ్య భద్రత కోసం తీసుకుంటున్న ఈ చర్యలు ప్రజల నుండి ప్రశంసలు పొందుతున్నాయి. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ మాధవి, వైద్య సిబ్బంది, బిల్లే శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ మద్యం రవాణా పై చర్యలు చేపట్టాలి

### డిప్యూటీ కమిషనర్ నాగ ముద్దయ్య

పుట్టపర్తి టౌన్, జూన్ 18, ప్రభాతవార్త

జిల్లాలో ఇతర రాష్ట్రాల నుంచి అక్రమ మద్యం సరఫరా కాకుండా పటిష్టంగా చర్యలు తీసుకోవాలని ప్రొహిబిషన్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య అధికారులను ఆదేశించారు. బుధవారం ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ పుట్టపర్తి స్టేషన్ ను డిప్యూటీ కమిషనర్ తో పాటు అసిస్టెంట్ ప్రొహిబిషన్ ఎక్సైజ్ సూపర్డెంట్ శ్రీరామ్ తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా పుట్టపర్తి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గల మండలాలను నాటు సారా రహిత మండలాలుగా చేయాలని, అక్రమ మద్యం పూర్తిస్థాయిలో అరికట్టాలని, అనుమానిత వ్యక్తులను పట్టుబడిన నేరస్తులను బైండోవర్ చేయాలన్నారు. మారుమూల ప్రాంతాలలో ఇప్పటికీ నాటు సారా కాస్తున్నారన్న సమాచారం ఉందని ప్రొహిబిషన్ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ మద్యం షాపులను నిబంధనలకు అనుగుణంగా మద్యం విక్రయించాలని ఎం ఆర్ పి ధరలకే మద్యం అమ్మాలన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ స్టేషన్ లోని రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రొహిబిషన్ ఎక్సైజ్ సబ్ ఇన్స్పెక్టర్ శివప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యుత్‌షాక్‌తో వ్యక్తి మృతి



విద్యుత్‌షాక్‌తో మృతి చెందిన జిలానీ

కదిరి, జూన్ 18 ప్రభాతవార్త

కదిరి పట్టణంలోని జెండా వీధిలో నివాసం ఉంటున్న షేక్ జీలాని(39) విద్యుత్‌షాక్‌తో మృతి చెందాడు. ఇందుకు సంబంధించి భార్య ఫర్హానా తెలిపిన వివరాల మేరకు తన భర్త తాపీ పనిచేస్తూ జీవనం చేసేవారమని, మధ్యాహ్నం 3:30 గంటల సమయంలో తన భర్త జీలాని మరో వ్యక్తి కలిసి చౌక్ జంక్షన్ వద్ద తాయి జ్యువెలర్స్ వెనుకవైపున కాలువ కనపడకుండా ఇనుపకడ్డీలు అమర్చి బండలు వేసే క్రమంలో ప్రమాద వశాత్తు డ్రిల్లింగ్ మిషన్ వైర్ తగలడం వల్ల విద్యుత్‌షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడన్నారు. ఆమె ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు సిఐ తెలిపారు.

## పోలీస్ టెక్నికల్ టీంకు ప్రోత్సాహకాలు

అనంతపురం కలెక్టరేట్ జూన్ 18 ప్రభాతవార్త

జిల్లాలో ఇటీవల నిర్వహించిన కానిస్టేబుల్ అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షల్లో మంచి విధులు నిర్వర్తించిన టెక్నికల్ సిబ్బంది. ప్రజలకు మెరుగైన సేవలు అందిం చడంతో పాటు శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ కోసం జిల్లా పోలీసుశాఖ దాదాపు 12 ఐ.టి అప్లికేషన్లు అమలు చేస్తోంది. వీటిలో సి.సి.టి.ఎన్.ఎస్, మీ సేవ, స్మార్ట్ పోలీస్, ఐరాడ్, ఈ చలానా, తదితర అప్లికేషన్లు ముఖ్యమైనవని జిల్లా ఎస్పి జగదీష్ తెలిపారు. జిల్లాలో ఈ అప్లికేషన్ల అప్డేషన్‌లో జాప్యం లేకుండా రాష్ట్ర స్థాయిలో పోటీ పడే విధంగా మానిటర్ చేయడంలో పోలీస్ టెక్నికల్ టీం ప్రతిభావంతమైన విధులు నిర్వర్తిస్తోంది. అంతేకాకుండా ఐదు నెలల క్రితం స్థానిక నీలం సంజీవరెడ్డి మైదానంలో కానిస్టేబుల్ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ ప్రక్రియలో భాగంగా అభ్యర్థుల సర్టిఫికెట్స్ పరిశీలన, బయోమెట్రిక్ తీసుకోవడంతో పాటు ఎత్తు, చాతీ, తదితర ఫిజికల్ మెజర్ మెంట్స్, 1600 మీటర్లు, 100 మీటర్లు, లాంగ్ జంప్ పరీక్షలు నిర్వహించారు. ప్రతీ ఈవెంట్ వద్ద ఏమాత్రం జాప్యం జరగకుండా టెక్నికల్ సిబ్బంది అప్‌డేషన్ చేస్తూ మంచి పని తీరు కనపరిచారు. జిల్లాలో ఐ.టి.అప్లికేషన్స్ అమలు చేయడంలో ప్రతిభావంతంగా పని చేయడం పట్ల జిల్లా ఎస్పి పి.జగదీష్ అభినందిస్తూ టెక్నికల్ సిబ్బందికి స్మార్ట్‌వాచ్‌లు అందచేశారు.

## మడకశిర పట్టణం సమస్యల రహితమే లక్ష్యం...

### మునిసిపల్ కమిషనర్ కు ఎమ్మెల్యే రాజు ఆదేశం..

మడకశిర టౌన్ జూన్ 18 ప్రభాతవార్త

మడకశిర పట్టణం సమస్యల రహిత పట్టణం కావడమే లక్ష్యంగా పనిచేయాలని మడకశిర పట్టణ మున్సిపల్ కమిషనర్ కు స్థానిక శాసనసభ్యులు, టీటీడీ పాలకమండలి సభ్యులు ఎం.ఎస్.రాజు ఆదేశించారు. బుధవారం మడకశిర పట్టణంలోని 4, 17వ వార్డుల్లో టీ టైమ్ విత్ ఎమ్మెల్యే కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు స్థానిక నాయకులు, అధికారులతో కలిసి పర్యటించారు. పర్యటించిన ప్రాంతాల్లో నెలకొన్న డ్రైనేజీ సమస్యలపై ఎమ్మెల్యే స్థానికులను ఆరా తీశారు. తక్షణమే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ను, అధికారులను ఆదేశించారు. అదేవిధంగా పట్టణంలో కాలినడకన తిరుగుతూ, ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ ఎమ్మెల్యే పర్యటించారు. కూరగాయల మార్కెట్ ను సందర్శించిన ఎమ్మెల్యే వ్యాపారస్తులతో కాసేపు ముచ్చటించారు. వ్యాపారస్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని కమిషనర్ ను కోరారు. తల్లికివందనం, పెన్షన్, రేషన్ వంటి సంక్షేమ పథకాలు అందుతున్నాయా? లేదా? అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. వివిధ సమస్యలపై పట్టణ ప్రజలు చెప్పిన అంశాలన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించి, వాటిని పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జ్యోతీరావుపూలే సర్కిల్ వద్ద డ్రైనేజీ సమస్యకు పరిష్కారం చూపించారు. ఎమ్మెల్యే తమవద్దకు నేరుగా వచ్చి సమస్యలు తెలుసుకోవడం, సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై ఆరాతీయడంపై మడకశిర పట్టణ ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. ఈ టీ టైం ప్రోగ్రాంలో కౌన్సిలర్లు నరసింహారాజు. వెంకట లక్ష్మమ్మ.సుభద్ర నాగేంద్ర. మేఘన రమేష్. హనుమంతు. బలరాం. విక్రమ్. శ్రీనివాసులు. జిల్లా మైనార్టీ అధ్యక్షుడు భక్తర్. తెలుగు యువత నాయకుడు తిమ్మరాజు. నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 20న కదిరిలో జాబ్ మేళా

పుట్టపర్తి టౌన్, జూన్ 18, ప్రభాతవార్త

కదిరిలో ఈనెల 20న 11 బహుళ జాతీయ కంపెనీలతో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి బండ్ల హరికృష్ణ తెలిపారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ 20న ఉదయం 9 గంటలకు కదిరిలో ఎస్ టి ఎస్ ఎన్ ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ లో ఈ జాబ్ మేళా నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ జాబ్ మేళా లో టి సి ఎల్, టాటా ఎలక్ట్రానిక్, డాక్టర్ రెడ్డీస్, కియా ఇండియా, ఎస్బిఐ జీవిత బీమా, హుండాయ్ మొబైల్స్, ఎల్ ఎం ఎస్, కె ఐ ఎం ఎల్ తదితర జాతీయ కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారన్నారు. ఈ జాబ్ మేళాకు హాజరయ్యే ఉద్యోగ యువతీ యువకులు విద్య అర్హతలు పదవ తరగతి, ఇంటర్, ఐటిఐ, డిప్లమా, బి ఫార్మసీ, ఎం ఫార్మసీ, నర్సింగ్, డిగ్రీ, బీటెక్, పి జి చదివిన వారు 18 సంవత్సరాల నుంచి 35 సంవత్సరాల వయసులోపు గల అభ్యర్థులు అర్హులని ఆయన తెలిపారు.

## పాలిటెక్నిక్ ప్రవేశాల కౌన్సిలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి




ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల

తాడిపత్రిటౌన్, జూన్ 18 ప్రభాతవార్త

పాలిసెట్-2025లో ఉత్తీర్ణత పొంది ర్యాంకులు సాధించిన విద్యార్థులకు 2025-26 విద్యా సంవత్సరంలో పాలిటెక్నిక్ ప్రవేశాల కొరకు నిర్వహించే కౌన్సిలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ జి.వీరాస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఆన్‌లైన్‌లో ప్రాసెసింగ్ ఫీజు (ఒసి, బిసిలు 700 రూపాయలు, ఎస్‌సి, ఎస్‌టిలు 250 రూపాయలు) చెల్లించి ఆ రశీదుతో పాటు ఒరిజనల్ సర్టిఫికెట్లు, 2 సెట్ల జెరాక్స్ కాపీలతో ర్యాంకుల ప్రకారం ఆయా తేదీల్లో ఉదయం 9 గంటలకు హాజరు కావాలన్నారు. జూన్ 21 నుండి జూన్ 28 వరకు ధృవపత్రాల పరిశీలన, జూన్ 25 నుండి జూన్ 30వరకు వెబ్ ఆప్షన్స్ నమోదు జరుగుతుందన్నారు. ముఖ్యంగా ఎస్‌టి విద్యార్థులు అనంతపురంలోను మరియు స్పెషల్ కేటగిరి (పిహెచ్, స్పోర్ట్స్) విద్యార్థులు విజయవాడలో మాత్రమే సూచించిన తేదీల ప్రకారం కౌన్సిలింగ్‌కు హాజరు కావాలని సూచించారు. మరిన్ని వివరాలకు హెల్ప్ లైన్ నెంబర్స్ 7901620198, 9493773778కు సంప్రదించి తమ సందేహాలను నివృత్తి చేసుకోవాలన్నారు. తాడిపత్రి పాలిటెక్నిక్ కళాశాలలో సివిల్, ఈఈఈ, ఈసిఈ బ్రాంచుల్లో ప్రతి విభాగంలో 60 సీట్లు వుంటాయని ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ తెలిపారు.

## నూతన గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న రమేష్‌రెడ్డి



గృహప్రవేశం కార్యక్రమంలో పాల్గొన్న రమేష్‌రెడ్డి

తాడిపత్రిటౌన్, జూన్ 18 ప్రభాతవార్త

తాడిపత్రి పట్టణంలోని నంద్యాల రోడ్డులో వున్న ఎస్ఆర్ విల్లాస్‌లో నూతన గృహప్రవేశ కార్యక్రమానికి బుధవారం వైసిపి రాష్ట్ర కార్యదర్శి రమేష్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన పూజా కార్యక్రమాల్లో పాల్గొని నూతన గృహ యజమానులకు శుభాకాంక్షలు తెలియచేశారు.

## యోగాంధ్ర కార్యక్రమంపై సమావేశం



కార్యదర్శులతో మాట్లాడుతున్న ఎంపిడిఒ అలివేలమ్మ

పుట్లూరు, జూన్ 18 ప్రభాతవార్త

యోగాంధ్ర కార్యక్రమంపై మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం ఎంపిడిఒ అలివేలమ్మ పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ యోగాంధ్ర కార్యక్రమంలో అధికారులు, ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపిడిఒ తెలియచేశారు.

## బాబా శత జయంతి వేడుకలను జయప్రదం చేయాలి

### జిల్లా కలెక్టర్ టి.ఎస్.చేతన్



అధికారులతో సమీక్షిస్తున్న జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్

శ్రీ సత్యసాయి జిల్లా, జూన్ 18, ప్రభాతవార్త ప్రతినిధి:

భగవాన్ శ్రీ సత్యసాయి బాబా శత జయంతి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అధికారులు తమకు అప్పగించిన విధులలో సాధించాలని జిల్లా కలెక్టర్ టి.ఎస్.చేతన్ ఆదేశించారు. నవంబర్ 23న శతజయంతి సమీపిస్తున్నందున ముందస్తుగా చేపట్టవలసిన చర్యలపై బుధవారం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నందు వివిధ శాఖల అధికారులు, శ్రీ సత్య సాయి ట్రస్ట్ సభ్యులతో పాటు జిల్లా ఎస్పి వి.రత్న , జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డిఆర్ఓ విజయసారథి తదితరులతో కలసి జిల్లా కలెక్టర్ టి.ఎస్.చేతన్ సమీక్షా సమావేశం నిర్వహించారు. తొలుత ఆయా శాఖల అధికారులకు కేటాయించిన విధుల పురోగతిని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. తమకు అప్పగించిన విధులను అధికారులందరూ సంయుక్తంగా పనిచేసి భగవాన్ శ్రీ సత్యసాయి బాబా 100వ జయంతి వేడుకలను విజయవంతం చేయాలన్నారు. ప్రముఖులు, అత్యంత ప్రముఖులు ఈ వేడుకలకు వచ్చే అవకాశం ఉన్నందున ఆరు హెలీప్యాడ్ లను ఏర్పాటుచేయలన్నారు. భక్తులకు ఇబ్బంది లేకుండా తాత్కాలిక వసతి ఏర్పాట్లు, తాగునీరు, తాత్కాలిక టాయిలెట్స్, వాహనాల పార్కింగ్ సంబంధింత అదుకారులు ఏర్పాటు చేయాలన్నారు. రైల్వే స్టేషన్ సమీపంలో కూడా తాత్కాలిక టాయిలెట్స్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. ట్రాఫిక్, పోలీస్ బందోబస్తు, రవాణా సౌకర్యం, నిరంతర విద్యుత్ సరఫరా, పట్టణ సుందరీకరణ తో పాటు చిత్రావతి నది సుందరీకరణ, భద్రతా చర్యలు తదితర అంశాలపై ప్రత్యేక దృష్టిని సారించి బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు.హారతి ఇచ్చే చిత్రావతి, కమ్మవారి పల్లి, కప్పలబండ, ఎంఎస్ ఎం ఈ..పాయింట్స్ వద్ద బారికేడింగ్ ఏర్పాటు చేయాలని, భద్రతా సిబ్బందిని ఏర్పాటు చేయాలన్నారు. అలాగే వివిధ మార్గాలను, పాయింట్స్ ను భక్తులకు తెలిసే విధంగా శైనేజెస్ ను ఏర్పాటు చేయాలన్నారు. భక్తులకు సౌకర్యార్థం కంట్రోల్ రూమ్ ను ఏర్పాటు చేయాలన్నారు. అన్ని పాయింట్స్ వద్ద మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేసి తగినన్ని మందులు సిద్ధంగా ఉంచుకోవాలని డిఎంహెచ్ఓ ను ఆదేశించారు. బాధ్యతలు అప్పగించిన ప్రతి ఒక్క అధికారి చిత్తశుద్ధితో పనిచేసి ఈ పండుగను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పుట్టపర్తి ఆర్డీవో సువర్ణ, డిఆర్డీఏ, డ్వామ పీడిలు నరసయ్య, విజయ ప్రసాద్, డిఎంహెచ్ఓ ఫిరోజ్ బేగం, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి యోగాంధ్ర పోటీలలో విజేతలుగా శ్రీ సత్యసాయి జిల్లా వాసులు

పుట్టపర్తి (కల్చరల్), జూన్ 18, ప్రభాతవార్త

11వ అంతర్జాతీయ యోగా కార్యక్రమములో భాగంగా రాష్ట్ర స్థాయి లో విజయవాడ నందు నిర్వహించిన యోగా పోటీలలో శ్రీ సత్యసాయి జిల్లాకు చెందిన నలుగురు విజేతలుగా నిలిచినట్లు యోగాంధ్ర జిల్లా స్థాయి నోడల్ అధికారి, డిఆర్డీఏ పీడి నర్సయ్య తెలియజేశారు. వీరు జిల్లా స్థాయి లో అర్హత సాధించి ఈ నెల 16, 17 తేదీలలో న విజయవాడ లో పోటీలలో పాల్గొనడం జరిగిందన్నారు. యోగా ఎస్సే రైటింగ్ జూనియర్స్ నందు కంసాల తనుశ్రీ రెండవ స్థానంలో నిలువగా, యోగా స్లోగన్ జూనియర్స్ నందు రుచిత, మూడవ స్థానంలో, యోగా సోలో ఆసనాస్ నందు ఆశ. దేవయాని మూడవ స్థానంలో, సింక్రో నైజడ్ గ్రూప్ యోగ పోటీ నందు కె. ఎస్. శిల్ప, ఆర్. దేవయాని, కె. మమత, టి. వెంకటేష్ లు మూడో స్థానంలో నిలిచినట్లు తెలియజేశారు.ఈ యోగ పోటీలలో విజేతలుగా నిలిచి రాష్ట్ర స్థాయి లో శ్రీ సత్యసాయి జిల్లా కు గుర్తింపు తెచ్చినందుకు జిల్లా కలెక్టర్ టి.ఎస్. చేతన్ హర్షం వ్యక్తం చేశారు. ఈ యోగా విజేతలను 21 వ తేది హిందూపురములో నిర్వహించే ప్రపంచ యోగా దినోత్సవం నాడు ప్రజలందరి సమక్షములో సన్మానించనున్నట్లు తెలియజేశారు.

## కదిరి, శింగనమల ఎన్నికల పరిశీలకుడిగా బోరు రమణ

ఓబుళదేవరచెరువు, జూన్ 18, ప్రభాతవార్త



కదిరి, శింగనమల నియోజకవర్గాల తెలుగుదేశం పార్టీ ఎన్నికల పరిశీలకుడిగా మండలంలోని గౌరాపురం గ్రామానికి చెందిన బోరు రమణను ఎంపిక చేసిన ఆపార్టీ అధిష్టానం ఉత్తర్వులు వెలువడించింది. ఈ సందర్భంగా బోరు రమణ బుధవారం విలేకరులతో మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి, పార్టీ బలోపేతానికి అంకితబావంతో అహర్నిషలు పనిచేసినందుకు పార్టీ గుర్తించి నాకు ఎన్నికల పరిశీలకుడిగా నియమించిందన్నారు. కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాలపై ప్రజలకు తెలియచేస్తానన్నారు. సిఎం చంద్రబాబు సారథ్యంలో రాష్ట్రం అభివృద్ధివైపు పరుగులు పెడుతోందన్నారు. ఎని ్నకల సందర్భంగా ఇచ్చిన ప్రతి హామీని కూటమి ప్రభుత్వం అమలు చేస్తుందని ప్రజలకు వివరించి పార్టీ పట్ల సధాబిప్రాయం కలిగేలా ప్రజలను నమ్మిస్తానన్నారు. పార్టీ అభివృద్ధికి క్రమశిక్షణతో పనిచేస్తానన్నారు. అధిష్టానం నాకు అప్పగించిన బాధ్యతను విస్మరించకుండా న్యాయం చేస్తానన్నారు. నా ఎంపికకు సహకరించిన ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రివర్యులు డాక్టర్ పల్లె రఘునాథరెడ్డికి కృతజ్ఞతలు తెలియచేసుకుంటున్నానన్నారు.

## పదోన్నతి పొందిన ఉపాధ్యాయుడికి ఘన సన్మానం



గౌస్ లాజంను సన్మానిస్తున్న తోటి ఉపాధ్యాయులు

ఓబుళదేవరచెరువు, జూన్ 18, ప్రభాతవార్త

మండల పరిధిలోని అచ్చామియాపల్లి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడి గౌస్ లాజం ప్రధానోపాధ్యాయుడుగా పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఇస్మాయిల్, అబుల్, వెంకటేష్, హరిలు బుధవారం కట్టుబడి గౌస్ లాజంను శాలువలు, పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. పదోన్నతి పొందడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఇదే సందర్భంలో విద్యార్థులకు యూనిఫాం, పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం మొక్కలు నాటి పర్యావరణ విశిష్టతను విద్యార్థులకు చాటి చెప్పారు.

